

## అమ్మో.. జూన్

జూన్ అంటేనే జనం భీతిల్లుతున్నారు. ఓ వైపు సాగు పెట్టుబడి.. మరోవైపు పిల్లల చదువు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. 8లో▸



## రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుదాఘాతంతో మూగజీవాలు చనిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



అనంతగిరి: ఆలంపల్లిలో చిన్నారుల ఆలింగనం



తాండూరు: పట్టణ సమీపంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దుద్యాల్: హస్నాబాద్ ఈద్గా వద్ద..

## త్యాగానికి ప్రతీక బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం ఈద్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ఎస్పీ కోటిరెడ్డి బదిలీ

**కొత్త పోలీస్ బాస్‌గా నారాయణరెడ్డి**



కొత్త ఎస్పీ నారాయణరెడ్డి



బదిలీ అయిన కోటిరెడ్డి

వికారాబాద్: జిల్లా ఎస్పీ కోటిరెడ్డి బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీ కోటిరెడ్డికి మేడ్చల్ డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. శంషాబాద్ డీసీపీగా ఉన్న నారాయణరెడ్డిని వికారాబాద్ ఎస్పీగా నియమించారు. జిల్లాలో రెండున్నర ఏళ్ల పాటు సేవలందించిన కోటిరెడ్డి శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా పూర్తి చేశారు. గంజాయి, గుట్కా, నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపారు.

### సద్వినియోగం చేసుకోండి

**డీఈఓ రేణుకాదేవి**

అనంతగిరి: జిల్లాలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్‌ఏ, ఎస్‌జీటీ, ఎల్‌పీ, పీఈటీ, పీఎస్ హెచ్‌ఎంలు (గత సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు ప్రిఫరెన్షియల్, మెడికల్ కేటగిరీల్లో ఏవైనా చేర్పులు చేసుకునే వారు) మంగళవారం తాండూరు ఆస్పత్రిలో జిల్లా మెడికల్ బోర్డు ఎదుట హాజరు కావాలని డీఈఓ రేణుకాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలన చేసుకొని వారు ఇచ్చే పత్రాన్ని తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు తాండూరు ఆస్పత్రిలోని జిల్లా మెడికల్ బోర్డు ముందు హాజరు కావచ్చని తెలిపారు. గతంలో ధ్రువపత్రాలు సమర్పించిన వారు తిరిగి రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

### సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబు



హుడాకాంప్లెక్స్: సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అంగోతు రాంబాబునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో సేన రాష్ట్ర నాయకులు తనను నియమించినట్లు రాంబాబునాయక్ తెలిపారు. తనపై నమ్మకంతో రెండోసారి సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు త్రిసభ్య కమిటీ సభ్యులు, సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, సేన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### మల్లేపల్లి ఐటీఐలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్

**నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన**



నాంపల్లి: పారిశ్రామిక శిక్షణా సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ముందుకు దూసుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టడానికి టాటా కంపెనీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కోర్సుల నిర్వహణ కోసం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం మల్లేపల్లిలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటిఐ) ప్రాంగణంలో 13500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సెంటర్స్‌లో ఆరు రకాల దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెడతారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిషన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులను ప్రవేశపెట్టి తర్ఫీదు ఇస్తారు. వీటితో పాటుగా మరో 20 స్వల్ప, అతి స్వల్ప కాల వ్యవధి కలిగిన కోర్సులను కూడా ప్రవేశపెడతారు. వీటిలో నిరుద్యోగ యువతకు రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మంగళవారం సీఎం కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

# ఉపాధ్యాయ పదోన్నతుల్లో తీరని అన్యాయం



**జిల్లాకు మంజూరు చేసిన జీహెచ్‌ఎం పోస్టులు 94**

- ఇప్పటి వరకు విధుల్లో చేరిన 90మంది
- జిల్లా ఎస్‌ఏలకు దక్కిన పోస్టులు 17 మాత్రమే
- మిగతా 77 పోస్టులు పాలమూరు, నల్లగొండ వాసులకే
- జీహెచ్‌ఎం పోస్టు.. మల్టీ జోన్‌కు మారడమే కారణం

వికారాబాద్: పదోన్నతుల ప్రక్రియలో జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ పక్క జిల్లాల వాళ్లు తన్నుకుపోనున్నారు. ఖాళీల్లో కనీసం ఇరవై శాతం కూడా జిల్లా వాసులకు దక్కడం లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల జీహెచ్‌ఎంలందరూ మన జిల్లా వాసులే ఉండగా.. ప్రస్తుతం కొనసాగుతున్న పదోన్నతుల ప్రక్రియలో సగానికి పైగా ఉన్నత పాఠశాలల హెచ్ పోస్టులు పక్క జిల్లాల వాసులతో నిండిపోయాయి. గతంలో జిల్లా పోస్టుగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడి పోస్టు జోన్ల పునర్విభజన తరవాత మల్టీ జోన్ పరిధిలోకి వెళ్లింది. ఇదే సమయంలో సీనియారిటీలో మన జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు వెనకబడి ఉండటంతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ పక్క జిల్లాలకు చెందిన వారు ఎగరేసుకుపోతున్నారు. దీంతో పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న జిల్లా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోంది. ఇదే సమయంలో మహబూబ్‌నగర్ నుంచి మన జిల్లాలో కలిసిన మూడు మండలాలకు చెందిన ఎస్జీటీల్లో కూడా ఎక్కువ మంది సీనియర్లు ఉన్నారు. దీంతో ఎస్జీటీ నుంచి స్కూల్ అసిసెంట్‌గా పదోన్నతి పొందే వారికి సైతం ఇదే తరహాలో అన్యాయం జరిగే అవకాశం ఉందని సంఘాల నేతలు వాపోతున్నారు.

**జిల్లా ఉపాధ్యాయులకు నష్టం**

స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యింది. వెబ్ ఆప్షన్లు పెట్టుకోవటం తోపాటు ఖాళీగా ఉన్న పాఠశాలలను ఎంచుకున్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టు గతంలో జిల్లా పరిధిలో ఉండగా ప్రస్తుతం మల్టీ జోనల్ పరిధిలోకి వెళ్లింది. దీంతో ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు పరిధిలోని 14 జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లందరూ జీహెచ్‌ఎం పోస్టుల కోసం పోటీ పడ్డారు.

ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో 94 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో జెడ్పీహెచ్‌ఎస్‌లలో 90, ప్రభుత్వ పాఠశాలల్లో 4 ఖాళీలు ఉన్నాయి. సీనియారిటీ ప్రాతిపదికన చూస్తే మన జిల్లాకు చెందిన వారు వెనకబడి ఉండటంతో 17 మంది స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే అవకాశం దక్కింది. మిగతా 77 మంది ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లకు మన జిల్లాలో పోస్టులు దక్కాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి జిల్లా వాసులకు అన్యాయం జరగకుండా జీఓలను సవరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

### బీఎడ్ చేసిన ఎస్జీటీలకు నష్టం

జిల్లాలో 1,063 పాఠశాలలు, 4వేల పైచిలుకు ఉపాధ్యాయులు ఉండగా 60 మంది ఎల్‌ఎఫ్ ఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే కోర్టు ఇచ్చిన తీర్పు బీఈడీ చేసిన ఎస్జీటీలకు శాపంగా మారింది. జిల్లాలో 98 మంది ఎస్జీటీలు బీఈడీ జాబితాలో సీనియారిటీలో ముందున్నారు. అయితే డీఈడీ చేసిన ఎస్జీటీలకే ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బీఈడీ చేసిన సీనియర్ ఎస్జీటీలకు ఆ పోస్టులు దక్కకుండా పోతున్నాయి. ఆ స్థానంలో డీఈడీ ఉండి సీనియారిటీ ఉన్న ఎస్జీటీలనుఆ స్థానంలో పదోన్నతులకు ఎంపిక చేయనున్నారు.

### “జిల్లా పోస్టుగా మార్చాలి



ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మన జిల్లాలో శిక్షణ అభ్యర్థుల కొరత ఉన్న సమయంలోనూ నాటి ప్రజా ప్రతినిధులు జిల్లా వాసులకు అన్యాయం జరగకుండా చూశారు. స్పెషల్‌గా అన్ ట్రైన్డ్ డీఎస్సీ వేసి జిల్లా వాసులనే నియమించి తరువాత శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు కూడా అలాగే ప్రత్యేక ఉత్తర్వులు తీసుకొచ్చి గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టును మల్టీ జోనల్ పోస్టు నుంచి జిల్లా పోస్టుగా మార్చాలి. లేకుంటే ఇప్పటిలాగే సగం కంటే ఎక్కువ ఉన్నత పాఠశాలలు పక్క జిల్లాల హెచ్‌ఎంలతో నిండిపోతాయి.

– శ్రీశైలం, పీఆర్టీయూ నాయకుడు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

# అన్ని గ్రామాలకు ఆర్టీసీ సేవలు

- పరిగి డిపోకి 17 కొత్త బస్సులు
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

పరిగి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు నడిచేలా చర్యలు తీసుకుంటామని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మరికల్ – మహబూబ్‌నగర్, పగిడ్యాల్ – కొత్లాబాద్ మార్గాల్లో ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పరిగి డిపోకు 17 కొత్త బస్సులు మంజూరు చేసిందన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి మంచి స్పందన వస్తోందన్నారు. దీంతో డిపోకు రెండింతల ఆదాయం అందుతోందని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు అన్ని గ్రామాలకు ఆర్టీసీ సేవలను పొడిగిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఇందుకు అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు. అధికారులు సక్రమంగా పని చేస్తేనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతాయని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, సంక్షేమ పథకాల అమల్లో అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో పరిగి మీదుగా రైల్వే లైన్ ప్రారంభం అవుతుందని, ప్రస్తుతం సర్వే పనులను జరుగుతున్నాయని వివరించారు. తాను ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పరిగి ఆర్టీసీ డీఎం కురుణశ్రీ,, కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పార్టీ నాయకుడు నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షులు ఆంజనేయులు, పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**త్వరలో తాండూరుకు కొత్త బస్సులు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

తాండూరు: త్వరలో తాండూరు ఆర్టీసీ డిపోకు కొత్త బస్సులు వస్తాయని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నతో కలిసి తాండూరుకు వచ్చిన కొత్త బస్సును ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి లక్ష్మీనారాయణపూర్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త బస్సులను మంజూరు చేసిందన్నారు. త్వరలో అవి డిపోకు వస్తాయని చెప్పారు. విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలగకుండా ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సును నడుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, రవిగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, వెంకన్నగౌడ్, నాయకులు డాక్టర్. సంపత్‌కుమార్, బాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తూరుకు ఆర్టీసీ బస్సు

బొంరాస్‌పేట: మండలంలోని కొత్తూరుకు సోమవారం ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తాండూరు నుంచి వడిచర్ల మీదుగా గ్రామానికి రోజుకు నాలుగు ట్రిప్పులు తిరగనుంది. దీంతో ప్రజలకు ఎమ్మెల్యేకు, తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సమత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు భీంరావు, బాలప్ప, ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, లక్ష్మయ్య, బలరాం, మహేందర్, బాలమ్మ, గుణశేఖర్, సూర్యకళ, శివమ్మ, లక్ష్మి, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు బోనం కోసం ఏర్పాట్లు

చార్మినార్: రానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా మాదిరిగానే సప్త మాతృకలకు సప్త బంగారు బోనం సమర్పించేందుకు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా బంగారు పాత్రలోని నైవేద్యాన్ని ఏడు అమ్మవారి ఆలయాలకు తీసుకెళ్లి సమర్పించేందుకు జోగిని నిషా క్రాంతికి సోమవారం మీరాలంమండిలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు వాయినాన్ని అందజేశారు. జులై 7న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో కమిటీ మాజీ చైర్మన్ పాటిల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.



జోగిని నిషా క్రాంతికి వాయినం అందజేస్తున్న గాజుల అంజయ్య దంపతులు

# ‘మహాగణపతి’ పనులకు శ్రీకారం

**ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో కర్రపూజ కార్యక్రమం**

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి రూపకల్పన పనుల్లో భాగంగా ప్రతి యేటా నిర్వహించే కర్ర పూజ కార్యక్రమం సోమవారం సాయంత్రం 5 గంటలకు మహాగణపతి మంటపంలో నిర్వహించారు. జేష్ట శుద్ధ ఏకాదశి సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకుల సమక్షంలో కర్రపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ 70 సంవత్సరాల ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కర్రపూజా కార్యక్రమాన్ని స్థాని క అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, రెండు మూడు రోజుల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలోనే ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ హితంగా వినాయకుడి విగ్రహం తయారు చేస్తామని, అన్ని ప్రభుత్వరంగ సంస్థలను కలుపుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు దానం నాగేందర్ తెలిపారు. మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదాన్ని అందేలా చూస్తామని తెలిపారు. పూజా కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి భగవంతరావు పాల్గొన్నారు.



కర్రపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

# అనుమతి లేని స్కూల్ సీజ్

- అడ్మిషన్లు ఆపేసిన ఎంఈఓ
- పాఠశాల సామగ్రి స్వాధీనం.. నోటీసులు జారీ



అధికారులు సీజ్ చేసిన పాఠశాల నూతన భవనం

తాండూరు: ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న పట్టణంలోని చైతన్య స్కూల్‌ను మండల విద్యాధికారులు సీజ్ చేశారు. సోమవారం సాయిపూర్‌లోని చైతన్య పాఠశాలను ఎంఈఓ వెంకటయ్య తనిఖీ చేశారు. పాఠశాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిషన్లను ఆపాలని ఆదేశించడం తోపాటు అక్కడి సామగ్రిని, స్కూల్ బిల్డింగ్‌ని సీజ్ చేశారు.

**ఒకే అనుమతి.. రెండు చోట్ల నిర్వహణ**

పట్టణంలోని చైతన్య స్కూల్ నిర్వాహకులు ఒక చోట అనుమతి పొంది రెండు చోట్ల పాఠశాలలను నిర్వహిస్తున్నారు. గతంలో పట్టణంలోని యాదిరెడ్డి చౌక్ ప్రాంతంలో పాఠశాల ఉండేది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు సరిగ్గా లేకపోవడంతో అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో స్కూల్‌ని పాతకుంట ప్రాంతానికి మార్చారు. అయితే ఇదే పాఠశాల పేరుతో సాయిపూర్ ప్రాంతంలోని తాత గుడి వద్ద నూతన భవనాన్ని నిర్మించి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈ విషయం మండల విద్యాధికారి దృష్టికి వచ్చింది. సోమవారం సదరు పాఠశాలను సందర్శించారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే అడ్మిషన్ల ప్రక్రియను ఆపేయాలని పాఠశాల యాజమాన్యానికి ఆదేశించారు. స్కూల్‌ని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించరాదని తల్లిదండ్రులకు సూచించారు. సాయిపూర్‌లోని చైతన్య పాఠశాలకు ప్రభుత్వ అనుమతి లేదన్నారు. ఈ పాఠశాలలో పిల్లలను చేర్చరాదన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**‘ప్రైవేటు’పై ప్రత్యేక నిఘా**

ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకుంటున్నారు. వారం రోజుల క్రితం పట్టణంలోని శివాజీ చౌక్ ప్రాంతంలోని నారాయణ స్కూల్‌ను అధికారులు సందర్శించారు. అనుమతి లేకుండా 8 నుంచి 10వ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి గదులను సీజ్ చేశారు. నారాయణ స్కూల్‌కి 7వ తరగతి వరకే ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## క్లుప్తంగా

### అటవీ భూములను రక్షిద్దాం

**డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్**

**ధారూరు:** అటవీ భూములను గుర్తించ రక్షించుకోవాలని అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అందమైన అడవులు, నీటి వనరులు, సహజ సారవంతమైన నేలలున్నాయన్నారు. అడవి నాశనం కాకుండా మన భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ధారూరు ఫారెస్టు రేంజ్‌లోని రాస్నం సెక్షన్ పరిధిలో దోర్నాల్ ఫారెస్టు బీట్‌లో కొందరు చెట్ల నరికివేస్తూ.. భూ ఆక్రమణకు యత్నిస్తున్నారని ఇది చట్టవ్యతిరేకమని వివరించారు. అడవులను నరికేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు భూముల పేరిట పట్టాలు పొందవచ్చనే దురాశతో పోటీపడి అడవులను ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### త్వరలో ఎస్సీ వర్గీకరణ



మాట్లాడుతున్న మల్లికార్జున మాదిగ

**తాండూరు రూరల్:** కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిందని.. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల 30 ఏళ్ల కల నెరవేరబోతోందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే వర్గీకరణ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, నాయకులు కృష్ణ మాదిగ, ప్రకాశ్‌మాదిగ, మహేందర్‌మాదిగ, శ్రీనివాస్‌మాదిగ, వెంకట్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎంపై కేసు నమోదు

**కొందుర్గు:** సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఏపీఎం రామస్వామి వేధింపులపై సోమవారం ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం రామస్వామి తన పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని పీర్జాపూర్ వీఓఏ మౌనిక వాపోయారు. గత మూడు నెలలుగా తనకు ఫోన్‌చేస్తూ వేధిస్తున్నాడని, అసభ్యకరమైన మేసేజ్‌లు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓసారి కూడా మండల సమాఖ్య మీటింగ్‌లోనే చేయి పట్టి లాగి తనను దుర్భాషలాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు.

### 9 మంది బైక్ రేసర్ల అరెస్ట్

- 10 బైక్‌లు సీజ్
- అడ్డుకున్న పోలీసులపైకి దూసుకెళ్లిన రేసర్లు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

**గచ్చిబౌలి:** అర్ధరాత్రి కొందరు యువకులు బైక్ రేస్‌లు నిర్వహిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తూ అడ్డు వచ్చిన పోలీసులపైకి దూసుకెళ్లారు. తప్పించుకున్న పోలీసులు స్టాపర్లను అడ్డు పెట్టడంతో వారు బైక్‌లను వదిలి పరారైన సంఘటన నాలెడ్జి సిటీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బైక్ నంబర్ల ఆధారంగా రాయదుర్గం పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు. సీఐ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి నాలెడ్జిసిటీలోని టీ హబ్ జంక్షన్‌లో బైక్ రేసులు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోల్ మొబైల్, బ్లూకోల్ట్స్‌తో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా రేసర్లు స్టంట్‌లు చేస్తూ కేకలు వేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. అడ్డుకునేందుకు వచ్చిన పోలీసుల మీదికి దూసుకురావడంతో చాకచక్యంగా తప్పించుకున్నారు. రోడ్లకు అడ్డంగా స్టాపర్లు పెట్టడంతో కొందరు రేసర్లు పరారయ్యారు. మరి కొందరు బైక్‌లను వదిలి వెళ్లారు. బైక్‌ల ఆధారంగా సోమవారం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఈ నెల 1న టీ హబ్ జంక్షన్‌లో రేస్‌లు నిర్వహిస్తుండగా 50 స్పోర్ట్స్ బైక్‌లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయినా యువత ఏమీ పట్టనట్లు ప్రమాదకరంగా బైక్ రేస్‌లు నిర్వహిస్తుండటంతో వారి కట్టడి చేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



# అమ్మో.. జూన్

- ఖర్చుల దరువు.. బతుకు బరువు
- వ్యవసాయ పెట్టుబడులు.. పాఠశాల ఫీజులకు పెరుగుతున్న ఖర్చులు
- మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం



విత్తనాలు వేస్తున్న రైతులు



పిల్లలకు స్టేషనరి సామగ్రి కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

**దుద్యాల్:** జూన్ అంటేనే జనం భీతిల్లుతున్నారు. ఓ వైపు వ్యవసాయానికి పెట్టుబడి.. మరోవైపు పిల్లల చదువులు.. దీంతో సామాన్యుడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మృగశిర కార్తె నుంచి ఖర్చుల పెరుగుదల మొదలవుతోంది. వాతావరణం చల్లబడుతున్న తరుణంలో జూన్ ముచ్చెమటలు పట్టిస్తోంది. దిగువ మధ్య తరగతి, వ్యవసాయ ఆధారిత కుటుంబాల ప్రజలు పెరుగుతున్న ఖర్చులకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

**అన్నదాత పరిస్థితి ఆగం**

వానాకాలం సీజన్‌లో పంటలకు పెట్టుబడుల కాలం.. వ్యవసాయ భూములను చదును, దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే పలువురు రైతులు విత్తనాలు కొనుగోలు వంటి పనులు ప్రారంభించారు. ఎకరాకు కనీసం రూ.30వేల పెట్టుబడి అవసరం ఉంటుంది. ఐదెకరాలున్న రైతు దాదాపు రూ.లక్షకు పైగా డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తున్నా అది సరైన సమయానికి చేతికందడం లేదు. బ్యాంకు రుణాలు సైతం అవసరానికి అందడం లేదు. దీంతో రైతులు ఒకవైపు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే మరోవైపు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

**ఫీ'జులుం'**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో ఫీజులు కొంచెం తక్కువ వసూలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ.25 వేలకు పైగా, ప్రైమరీకి రూ.30 వేలు, హైస్కూల్‌కు రూ.40 వేల వరకు ఫీజులు ఉన్నాయి. ఏటా 10 నుండి 20 శాతం మేర ఫీజులు పెరుగుతుండడంతో తల్లిదండ్రులపై భారం పడుతుంది. దీనికి తోడు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, స్టడీ మెటీరియల్స్ తదితరుల ఖర్చులతో తల్లడిల్లుతున్నారు. ప్రైవేట్ ఉద్యోగస్తులు, చిరు వ్యాపార్సతులపై బడి ఫీజుల భారం మరింత ఎక్కువగా కనిపిస్తుంది.

**ఇరు వైపులా భారం**



జూన్ వచ్చిందంటే చాలు రెండు వైపులు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఒక వైపు పిల్లల చదువుకు, మరో వైపు పంటకు పెట్టుబడులు. దీంతో ఆర్థికంగా భారమవుతోంది. వేసవి సెలవులు పూర్తవుతున్నాయంటేనే మానసిక ఒత్తిడి కలుగుతోంది.

– నర్సింలు గౌడ్, రైతు, ఆలేడ్

# ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ వాసుదేవరావు

**అనంతగిరి:** వచ్చే ఏడాది సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ వాసుదేవరావు అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాలకు చేపట్టే కార్యక్రమాలపై సమీక్షించారు. అన్ని విభాగాలు పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డి, మహిళా సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గీతాపావని, జిల్లా అధ



మాట్లాడుతున్న వాసుదేవరావు

జగన్‌సింగ్ ఠాకూర్, కన్వీనర్లు సత్యనారాయణగౌడ్, వీరేశం, అనంతరావు, రామకృష్ణారెడ్డి, బందోయ్య, ప్రభాకర్, వెంకటరెడ్డి, ప్రేమ్‌కుమార్, బసవేశ్వర్, సునీల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళసూత్రం పోయిందని వెళ్తే..

**వెంగళరావునగర్:** మంగళసూత్రం దొంగిలించారని ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మహిళను పోలీసులు నాలుగు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన సంఘటన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బర్కత్‌పురలో నివాసం ఉంటున్న శ్రీరేఖ ఈ నెల 15న స్థానిక మధురానగర్‌లోని తన బంధువుల వద్దకు వచ్చింది. 16వ తేదీ తన సోదరునితో కలిసి రైతుబజార్‌కు వెళ్లి కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూసుకోగా తన మంగళ సూత్రం కనిపించలేదు. హుటాహుటిన రైతుబజార్‌కు వెళ్లి విచారించినా ఫలితం లేదు. ఆమె సమీపంలోని సనత్‌నగర్ పీఎస్‌కు వెళ్లగా అది తమ పరిధి కాదని ఎస్ఆర్‌నగర్‌కు పంపారు. ఎస్ఆర్‌నగర్ పీఎస్‌కు వెళ్లగా ఆ ఏరియా బోరబండ పీఎస్ పరిధిలోకి వస్తుందని వెనక్కు పంపారు. తిరిగి బోరబండకు వెళ్లి ఫిర్యాదు చేయగా అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ఆ పీఎస్‌లో కూడా ఫిర్యాదు తీసుకోకుండా మధురానగర్‌కు పంపారు. చివరకు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అసలే మంగళసూత్రం పోగొట్టుకుని బాధలో ఉన్న మహిళను నాలుగు పీఎస్‌లకు తిప్పడం ఎంతవరకు సబబని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు..

# ప్రాణాలపైకి తెచ్చిన అతివేగం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం



తీవ్రంగా గాయపడిన మహేందర్‌రెడ్డి

- ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ
- ఏడుగురికి గాయాలు

**మోమిన్‌పేట్:** ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు వాహనాలు ఢీకొని ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మోమిన్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని వెల్చాల్ సమీపంలో ఉన్న పెన్నార్ కంపెనీ ఉద్యోగస్తులు సురేశ్, రమేశ్ విధులు ముగించుకుని సుమోలో హైదరాబాద్ బయలుదేరారు. మండల పరిధిలోని సయ్యద్ అల్లిపూర్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, టిల్లు, మహేందర్ కూరగాయలు విక్రయించి అశోక్ లేలాండ్ వాహనంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో స్థానిక నయారా పెట్రోల్ పంప్ దగ్గర ఎదురెదురుగా వస్తున్న సుమో, లేలాండ్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో పెన్నార్ ఉద్యోగస్తుడు సురేశ్ తలకు తీవ్రగాయాలవ్వగా.. మహేందర్‌రెడ్డి రెండు కాళ్లు విరిగాయి. సుమో డ్రైవర్ వినోద్, రమేశ్, మహేందర్, టిల్లు, చెన్నారెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# బైక్ అదుపుతప్పి.. చెట్టును ఢీకొట్టి

- ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**చేవెళ్ల:** అతివేగంతో బైక్‌పై వెళ్లి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని అల్లవాడ బస్టాప్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పామెన గ్రామానికి చెందిన షాపూర్ నర్సింలు, అదే గ్రామానికి చెందిన శివ బైక్‌పై గ్యాస్ సిలిండర్ కోసమని షాబాద్ మండలానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో అల్లవాడ బస్టాప్ సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న వారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టారు. దీంతో ఇద్దరూ ఎగిరి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయలు కావటంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే క్షతగాత్రులను చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య కోసం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.



ఘటనాస్థలిలో తీవ్రగాయాలతో నర్సింలు, శివ

ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వివరించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ఎన్కేపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు(ఫైల్)

# రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్స్

- తెగిపడుతున్న విద్యుత్ వైర్లు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- నష్టపోతున్న రైతులు

**పూడూరు:** విద్యుదాఘాతంతో మూగ జీవాలు మృత్యువాతపడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ ఫార్మర్‌లు, స్తంభాల వద్ద లూప్‌లైన్ల కారణంగా నిత్యం ఏదో ఓ చోట ప్రమాదం సంభవిస్తూనే ఉంది. వర్షాకాలం ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. మరమ్మతులు చేసేందుకు వెళ్లిన వారు సైతం ప్రమాదాల బారిన పడుతోన్నారు. వారం క్రితం కురిసిన వర్షానికి కిష్టం గోపాల్‌కు చెందిన ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ఎర్తింగ్ సమస్య కారణంగా విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. గతేడాది ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఎన్కేపల్లి సమీపంలో మాచీస్ ఫ్యాక్టరీ వద్ద 11కేవీ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో అక్కడ మేత మేస్తున్న ఓ ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. రేగడిమామడిపల్లి గ్రామానికి చెందిన రైతు ఎండీ షరీఫ్ పొలం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి సాకుతున్న పశువులు, జీవాలు విద్యుత్ ప్రమాదాల బారిన పడి చనిపోతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ పార్మర్‌ల వద్ద కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికి అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్ పార్మర్‌ల వద్ద రక్షిత కంచెలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

**పరిహారం ఇవ్వాలి**



అధికారుల నిర్లక్ష్యంతోనే ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తోంది. వర్షాకాలం విద్యుదాఘాతంతో మూగజీవాలు, విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మా ప్రమాదాలను నివారించాలి. బాధిత రైతులకు నష్ట పరిహారం అందించాలి.

– వెంకటయ్య, ఆర్టీఐ మండల కన్వీనర్, పూడూరు

**చర్యలు తీసుకుంటున్నాం**

వర్షాలు పడటంతో ట్రాన్స్ పార్మర్‌ల వద్ద విద్యుత్తు షాక్ తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా ట్రాన్స్ ఫార్మర్‌లు ఉన్నాయి. కూలిపోయే స్థితిలో ఉన్న దిమ్మెలను సరి చేసేలా ఎస్టిమేట్‌లు వేస్తున్నాం. అనుమతులు రాగానే పూర్తిస్థాయిలో ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారిస్తాం. నష్ట పరిహారం కోసం రైతుల వద్ద వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించాం.

– సందీప్, విద్యుత్ ఇంచార్జి ఏఈ, మన్నెగూడ

### రేపు వికారాబాద్‌లో ఎంపీ కొండాకు సన్మానం

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి**

**ధారూరు:** చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఈ నెల 19న సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన ఈ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ

**అనంతగిరి:** వికారాబాద్ శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కిషన్‌జీని ఎ స్పీ కోటిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆదివారం రాత్రి కిషన్‌జీ విధులకు వెళ్లే సమయంలో బైక్ అదుపుతప్పి గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పట్టణంలోని ఈషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆస్పత్రిలో పరామర్శించారు. పోలీస్ శాఖ తరఫున తోడుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ డేవిడ్ తదితరులున్నారు.



కిషన్‌జీతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

# ఏం చేద్దాం..?

**ఫార్మా భూములపై సర్కార్ యోచన**

- టౌన్‌షిప్‌ల నిర్మాణమా.. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటా..?
- లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో మరోసారి కదలిక
- అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రాధాన్యంగా అడుగులు
- త్వరలో నిర్ణయం ప్రకటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

**యాచారం:** ఫార్మాసిటీకి సేకరించిన భూములను ఏం చేద్దామనే విషయమై రేవంత్‌రెడ్డి సర్కార్ దృష్టి సారించింది. ఈ అంశంపై చర్చించేందుకు త్వరలోనే ఓ ఉన్నత స్థాయి బృందం సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఫార్మా భూముల్లో ఫార్మా విలేజ్‌లు నిర్మిస్తామని ఓసారి.. భారీ టౌన్‌షిప్‌లు నిర్మించి, ఈ ప్రాంతాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని మరోసారి సీఎం స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు పెరిగాయి. ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఫార్మా అంశం కొంత మరుగున పడినట్లయింది.

**త్వరలో నిర్ణయం**

మహానగరానికి అతి సమీపంలో, శంశాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరాన ఫార్మాసిటీకి సేకరించిన భూములున్నాయి. నాగార్జునసాగర్– శ్రీశైలం హైవేల మధ్య సేకరించిన భూముల్లో ప్రపంచ స్థాయిలో మంచి పేరున్న విదేశీ సంస్థలతో కంపెనీలు ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ కంపెనీల ఏర్పాటుతో స్థానికంగా భూములు కోల్పోయిన రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. స్థానికుల నుంచి వ్యతిరేకత రాకుండా.. అభివృద్ధి, ఉపాధి కల్పన కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు సమా చారం. ఈ ప్రాంతానికి ప్రముఖ కంపెనీలు వస్తే ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు, వ్యవసాయ భూ ముల ధరలకు మళ్లీ రెక్కలొచ్చే అవకాశం ఉంటుంది. ఫార్మాసిటీకి సేకరించిన భూముల పక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పరిధిలో ఇప్పటికే పలు ప్రముఖ కంపెనీలు ఏర్పాటైన విషయం తెలిసిందే.

**9,500 ఎకరాలకు పైగా సేకరణ**

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పది గ్రామాల్లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం 19,333 ఎకరాల భూములు సేకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే టీఎస్ఐఐసీ (రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ) ద్వారా 9,500 ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూములను సేకరించింది. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దు చేస్తామని.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై బాధిత, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# మనోహరంగా తిమ్మాపూర్ రైల్వేస్టేషన్





రైల్వే స్టేషన్ ఆవరణలో గ్రీనరీ



పరిశుభ్రంగా ప్లాట్‌ఫాం

- రెండుసార్లు ఉత్తమ అవార్డుకు ఎంపిక
- సినిమా షూటింగ్‌లకు అడ్డా

**కొత్తూరు:** రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సకల సౌకర్యాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. స్టేషన్ చిన్నదైనా అందుబాటులో ఉన్న వసతులతో మేజర్ జంక్షన్‌తో పోటీ పడుతోంది. అదే మండలంలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్. ప్రస్తుతం ఇది ఇతర స్టేషన్లకు ఆదర్శంగా నిలుస్తుంది. పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు, టాయిలెట్స్.. ఇలా స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం స్టేషన్ మీదుగా ప్రతి రోజు 20 రైళ్ల రాకపోకలు కొనసాగుతుండగా అందులో నాలుగు ఈ స్టేషన్‌లో నిలుస్తున్నాయి. పండగలు ఇతర రద్దీ దినాల్లో వందకు పైగా ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. పరిశుభ్రత విషయంలో స్టేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఆదర్శంగా తీర్చి దిద్దారు.



రైళ్ల సిగ్నలింగ్ వ్యవస్థను చూసేందుకు ఏర్పాటు చేసిన మానిటర్లు

**సిబ్బంది కృషి అమోఘం**

తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌లో పనిచేసే స్టేషన్ మాస్టర్లు, మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బంది కృషి ఫలితంగా రెండు పర్యాయాలు హైదరాబాద్ డివిజన్ స్థాయిలో ఉత్తమ స్టేషన్‌గా అవార్డులు దక్కించుకుంది. ప్రస్తుతం పాత భవనాలు, ప్లాట్‌ఫాంలను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. దానికి తోడు స్టేషన్ పరిసరాల్లో పచ్చదనం పరిఢవిల్లేలా పూలు, ఇతర మొక్కలను పెంచుతున్నారు. అలాగే స్టేషన్ నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**అగ్ర కథానాయకుల ఆసక్తి**

సుమారు 80 ఏళ్ల క్రితం ప్రారంభమైన తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ సినిమా షూటింగ్‌లకు ప్రఖ్యాతి గాంచింది. అగ్ర కథానాయకులు మొదలుకొని జూనియర్ల వరకు తిమ్మాపూర్ రైల్వేస్టేషన్లో సినిమా షూటింగ్‌లు చిత్రీకరించడానికి చాలా ఆసక్తి కనబర్చుతారు. దీనికి కారణం వారిలో ఉన్న సెంటిమెంటే. వారు నటించే సినిమాల్లో రైల్వేస్టేషన్ లోకేషన్ ఉందంటే ముందుగా తిమ్మాపూర్‌నే ఎంచుకుంటారు. ఇక్కడ ఒక చిన్న సీన్ చిత్రీకరించిన సినిమా హిట్ అవుతుందని హీరోలతో పాటు డైరెక్టర్లలో నమ్మకం గట్టిగా ఉంది. చిరంజీవి నటించిన అల్లుడా మజాకా.. వెంకటేష్ సూర్యవంశం, పవన్ కల్యాణ్ జానీ, బాలకృష్ణ సమరసింహారెడ్డితో పాటు పలు హిట్ చిత్రాల్లోని పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు.